బస్సు ఆగేసరికి సన్నగా వాన ప్రారంభమయింది. "ప్రకాశరావు పాలెం వచ్చింది సార్!" అన్నాడు కండక్టరు.

వాళ్లు దిగకుండానే ఇద్దరు ముగ్గురు బస్సు ఎక్కారు. ఇంతరాత్రివేళ కూడా ఇక్కడ సందడిగా ఉంది. అయితే మరిక భయంలేదు.... అనుకుంటూ సూటుకేసు తీసుకొని దిగాడు రమేష్. పిల్లవాడ్ని తీసుకొని బిక్కు బిక్కుమంటూ క్రిందికి దిగింది మంజుల.

బస్సు కదిలి వెళ్లిపోయింది.

అక్కడక్కడా చిన్న చిన్న దీపాలు. ఆ చీకట్లో మినుకుమినుకుమంటున్నాయి. వాన చినుకుల మధ్య వాళ్లలాగే అవికూడా భయం భయంగా కదలాడుతున్నాయి.


"ఈ ఊళ్లో కరెంటు లేదుకాబోలు!" తనలోతను అనుకున్నట్టు అన్నాడు రమేష్.

బాబుకి చీర చెంగు కప్పుతూ "పిల్లాడు తడిసిపోతున్నాడు. రిక్షా లేవయినా ఉన్నాయేమో చూడండి" అంది మంజుల తొందరపెడుతూ.

# వర్షం కురిసిన రాత్రి




– తటవర్తి రామచంద్రరావు



## 'వ్యాయామం చేస్తే ముసలితనం రాదు'

అమెరికా మాజీ అధ్యక్షుడు(సీనియర్) జార్జి బుష్ తన 72వ ఏట విమానం పైనుండి అరిజోనా ఎడారిలోకి దూకడంతో వృద్ధుల ఆరోగ్యంపైన జెరాన్టాలజిస్టుల (వృద్ధులపై పరిశోధనలు సాగించేవారు) విశ్వాసం మరింత పెరిగింది. అమెరికా మాజీ అధ్యక్షుడి ఈ సాహసచర్య ప్రపంచవ్యాప్తంగా అనేక వృద్ధ హీరోలకు ప్రేరణ కలిగించింది. అమెరికాకు చెందిన ఆల్‌డైట్‌జెల్ అనే ఒక వృద్ధవీరుడు ఇటీవల తన సొంత పారచ్యూట్ నుండి జంప్ చేసి తన 65వ పుట్టినరోజును జరుపుకున్నాడు. తరువాత గోల్ఫ్, టెన్నిస్, పరుగుపందాలతో పుట్టినరోజు వేడుకలు ఎంతో ఉత్సాహంగా గడిచాయి. తన 66వ బర్త్‌డే రోజు ఆహుతుల ముందు ప్రదర్శించబోయే కొత్తకొత్త ఫీట్ల కోసం ప్రణాళికలు రూపొందించటంలో జెల్ తలమునకలై ఉన్నాడుట.

మనదేశంలో చాలామంది 50 సంవత్సరాలు దాటేసరికి ముసలితనం వచ్చేసిందని, ఇక చురుకైన పనులేవీ చేయలేమన్న అభిప్రాయానికి వచ్చేస్తారు. ఆరోగ్యం, ఆహారవిషయాలలో మరింత శ్రద్ధ తీసుకోవలసిన ఈ వయసులో వాటి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ఫలితంగా వివిధరోగాలు, అకాల మృత్యువులు సంభవిస్తున్నాయి.

అధికశాతం అమెరికన్లు అరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాముఖ్యతనిస్తారు. సమతుల ఆహారం తీసుకుంటూ, శారీరకశ్రమతో కూడుకున్న పనులను చురుగ్గా చేయడం వల్ల వృద్ధాప్యాన్ని చాలాకాలం దూరం చేయొచ్చనే వాస్తవాన్ని చాలామంది అమెరికన్లు గ్రహించగలిగారు.

40 సంవత్సరాల వయసు దాటిన వారు ఎక్కువగా వ్యాయామం చేస్తే గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువని 30 ఏళ్ల క్రితం డాక్టర్లు భావించేవారు. శారీరకశ్రమ తగ్గించుకోవలసిందిగా సలహాలు ఇచ్చేవారు. అయితే ఇది పూర్తిగా అవాస్తమైనదని తేలింది. 60ఏళ్లు దాటిన స్త్రీపురుషులకు చురుకైన వ్యాయామం (పరుగులు తీయడం, వెయిట్‌లిఫ్టింగ్, ఇతర క్రీడలు) తప్పనిసరి అని ఇప్పుడు వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

మంచి ఆహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే వృద్ధాప్యాన్ని చాలావరకు వాయిదా వేయడమేకాక, ఎముకలు, కండరాలు దృఢంగా ఆరోగ్యవంతంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

ఆహారనియామాలు, వ్యాయామం వృద్ధుల్లో శక్తివంతంగా పనిచేస్తాయనేది అనేక పరిశోధనల్లో తేలింది. డూనక్ విశ్వవిద్యాలయానికి చెందిన సెంటర్ ఫర్ డెమోగ్రఫిక్ అధ్యయనకారులు అమెరికాకు చెందినవ 20,000 మందిపైన అధ్యయనం నిర్వహించారు. వీరంతా 65 సంవత్సరాలు పైబడినవారే. సుమారు 12 సంవత్సరాల సుదీర్ఘకాలం సాగిన ఈ సర్వేలో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సర్వే ప్రారంభంలో వీరిలో చాలామంది వివిధరకాల వ్యాధులతో బాధపడుతున్నారు. అయితే వీరంతా సమయానుకూలంగా పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేశారు. ప్రతిరోజూ టెన్నిస్, సైక్లింగ్, పరుగుపందాలు, జంపింగ్, స్విమ్మింగ్ వంటి క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమంగా వీరిలో తీవ్రమైన వ్యాధులు కూడా తగ్గుముఖం పట్టి, ఇప్పుడు సంపూర్ణఆరోగ్యాన్ని సొంతం చేసుకోగలిగారని ప్రొఫెసర్ కెన్నెత్ జి. మక్టోన్ అంటున్నారు. అయితే భారీ వ్యాయామాలు నిపుణుల సలహాప్రకారం సరైన పద్ధతిలో పాటించాలి.

వృద్ధులకు అనువైన వ్యాయామాల్లో స్విమ్మింగ్, ఏరోబిక్స్ ముఖ్యమైనవి. నడక, తేలికపాటి పరుగువంటి వ్యాయామాలకు ఎవరి సంప్రదింపులు అవసరంలేదు. ఇవి ఎవరికి వారే సొంతంగా ఆచరించవచ్చు. వృద్ధాప్యాన్ని వాయిదా వేయవచ్చు.

సి. వనజ

కళ్లు చికిలించి చూశాడతను. ఎక్కడా రిక్షాలు కనిపించలేదు. గబగబ రోడ్డు పక్కగా ఉన్న ఇంటివైపు అడుగులు వేశాడతను.

ఆ ఇంటి గుమ్మంలో నిలబడిఉన్నాడు ఓ ఆసామీ. "ఎవరు బాబూ? ఏడికెళ్లాలి?" అని అడిగాడు.

"ఇక్కడ రిక్షాలు దొరకవాండీ?" అని అడిగాడు రమేష్.

"ఈ వోనలో బేరాలుండవు కదండీ! ఇళ్లకెళ్లి పోయుంటారు. అసలెక్కడికెళ్లాలి తమరు?"

"ట్రావలెర్సు బంగళాకి. ఈ రాత్రి కక్కడే ఉందామని."

అప్పటికే మంజుల ఆ ఇంటి దగ్గరికి వచ్చింది. చంటివాడి నెత్తుకొని వానలో తడిసి పోతన్నారు. " అంటూ గబుక్కున లోపలికి వెళ్లి గొడుగు తీసుకువచ్చాడు. ఆమెకు గొడుగు పట్టి "లోపలికి రండమ్మా!" అన్నాడు.

ఏభయ్యేళ్లుంటాయేమో! పంచకట్టు. నలిగిన బనీను. అతను సగం తడుస్తూ ఆమెకు రక్షణ కలిపిస్తున్నాడు.

ఆమె మంత్రముగ్ధలా ఆ ఇంట్లో కడుగుపెట్టింది.

"తమరు కూడా లోపలికి రండి బాబూ!"

అప్రయత్నంగా లోపలికి వచ్చి బట్టలమీద ఉన్న వాన చినుకుల్ని దులుపుకున్నాడు రమేష్.

"ఇంత రేత్రికాడ ఇలాంటి సోటుకెలా వొచ్చారు బాబూ!" ఆ సామీ గొంతులో ఆశ్చర్యం కన్నా మందలింపు కొట్టవచ్చింది.

"దార్లో కారు పాడయింది. బస్సువాడు ట్రావలెర్సు బంగళా ఉందన్నాడిక్కడ. ఎలా వెళ్లాలో చెప్పండి"

"ఆ మధ్య తుపానులో పాడైపోయింది బాబూ! ఆడ ఎవరూ ఉంటంలేదు. ఈ వోనలు తగ్గింతొరాత రిపేరు సేపిత్తారంట. ఆడకెల్లి నాబంలేదు"

"ఓగాడ్! ఇప్పుడెలాగ?" అన్నాడు రమేష్ భార్యవైపు తిరిగి.

మంజులకి కన్నీళ్లొక్కటే తక్కువ. కాసేపటికి

క్రిందపడిపోయే బొమ్మలా వణికి పోయింది.

"ఈ ఊళ్లో తెల్సినోళ్లు ఎవరేనా ఉన్నారా బాబూ?"

"లేరు" అన్నాడు రమేష్ తల అడ్డంగా తిప్పుతూ.

"ఇంత రాత్రేల సంటి బిడ్డ తల్లి నెట్టుకొని వొర్సంలో ఏడికి పోతారు? ఈడనే ఉండిపొమ్మను." వంటింటి గుమ్మంలో నిలబడి ఉంది. ఆ ఆసామీ భార్య! కిర్సనాయిలు దీపం వెలుగు చిక్కగా లేకపోయినా ఆమె స్వచ్ఛమయిన మనస్సు మాత్రం ఆమె మాటల్లో వెలిగింది!

"అవునే! నాకు తట్నే లేదు. మట్టి బుర్ర..." అని తన్ను తాను తిట్టుకొని "మన్నింసండి బాబూ! మాది సిన్నిల్లు. తమ కభ్యంతరం నేపోతే ఈ రేత్రి కిడ్నే ఉండిపొండి" తన భార్యంటే గౌరవమే కాదు. తానూ అంత మంచి మనస్సున్న మనిషినని చెప్పకనే చెప్పాడు.

ఆ పరిసరాలు పరికించి చూశాడు రమేష్. తాటాకు పాక. ఒక్కటే సుగుణం. లోపల వర్షం లేదు. లోలోపల వంటిల్లు కాబోలు. వంట జరుగుతున్నట్టు పొయ్యిలోని మంటల వెలుగులు సగం తెరచిన వంటింటి తలుపు మీద కదలాడుతున్నాయి. ముందు గది కొంచెం విశాలంగా ఉంది. కాని, అక్కడో నులక మంచం, ట్రంకు పెట్టె, కర్ర దిమ్మ... తాడు మీద వేలాడే పాత బట్టలు తప్ప మరేవీ లేవు.

రమేష్ మెదడు మొద్దుబారినట్టయిపోయింది. ఈ రోజు ఏదీ తను అనుకున్నట్టుగా జరగటం లేదు. రోడ్డు మీదకిపోయి బస్సుకోసమో కారు కోసమో నిరీక్షించవల్సిందేనా?

అంతకంతకీ వర్షం పెరిగిపోతోంది. ఏదో వొక నిర్ణయం తీసుకోవాలి. టైము పరిగెడుతోంది. మరీ రాత్రయితే ఏం చేయటానికీ వీలుండదు. అప్పుడింకా ఇబ్బంది. "ఏం చేద్దాం మంజూ?" ఆమె ఏదో సలహా ఇస్తుందని కాదు. నిస్సహాయంగా అన్నమాటలు.

ఆమె పరిస్థితి మరీ అయోమయంగా ఉంది. ఈదురు గాలిలో రెపరెపలాడే చిటారు కొమ్మలా ఉంది. లోలోపలి భయమో తడిసిన చీర తెచ్చిన వణుకో ఆమె గజగజలాడుతోంది.

"ఐ థింక్! దేరీజ్‌నో ఆల్టర్‌నేటివ్ ఎక్సెప్ట్ టు స్టే హియర్!"

అతనితో ఏమీ అనలేక "మామూలుగా మీ కిబ్బంది అవుతుందేమో!" అంది మంజుల.

"అయ్యో! ఎంత మాట తల్లే! ఓ రాత్రి కేమయి పోద్దని" అంది ఆ ఇంటి ఇల్లాలు.

"ఇక్కడ వేన్నీళ్లు కాని పాలు కాని దొరుకుతాయా?" అని అడిగాడు రమేష్.

"తమరు గాబరా పడమోకండి. బాబుకి పాలు దొరుకుతయ్యి. తమకి పెరుగూ దొరుకుద్ది. ముందా తడి బట్టలు ఇడిసేసి పొడి బట్టలు కట్టుకోండి" అన్నాడు తను.

రమేష్ మనస్సు కొంచెం కుదుటపడింది. "తెల్లారేసరికి నేను కార్ని బాగుచేయించి తెచ్చుకోవాలి. అంతవరకు మీరు మా ఆవిడ్ని పిల్లాడ్ని చూసుకుంటే చాలు."

"ఎంతమాట బాబూ! తమరింతగా చెప్పాలా? నిచ్చింతగా ఎల్లి రండి. ముందు ఓ ముద్ద తినెల్లండి." అంది ఆ ఇల్లాలు.

మనసూర్తిగా అంటున్న మాటలు. తేనె సోనలయి కురిశాయి. పట్నంవాళ్లు గొప్పింటివాళ్లు అప్రతిభులయిపోయారు!

"అదేం వద్దు. తొందరగా వెళ్లాలి. పొద్దుపోతే లారీలు కూడా దొరకవు" రమేష్ మాటలింకా పూర్తికాలేదు. ఇంతలో అటునుంచి ఏదో లారీ వస్తున్న చప్పుడు వినిపించింది. "...వస్తా మంజూ! తెల్లవారక ముందే వచ్చేస్తా! రిలాక్స్!"

'అయ్యో! బాబుగారు తడిసిపోతున్నారు." అని గొడుగు తీసుకొని అతని వెనకనే పరిగెత్తాడు ఆ ఆసామీ.

లారీ వచ్చిన సవ్వడి. రమేష్ గొంతు వాళ్లొప్పుకున్నట్టున్నారు. లారీ కదలి వెళ్లిపోయిన చప్పుడు.

ఆ ఆసామీ వెనక్కి వచ్చాడు. "బాబుగారెల్లిపోనారు." తన చేతిలోని గొడుగు రమేష్‌కి ఇచ్చేశాడని అతని తడిబట్టలే చెపుతున్నాయి.

మంజుల మూగదానిలాగయిపోయింది. ఈ రోజు అంతా చిత్ర విచిత్రంగా ఉంది. రెండు గంటల క్రితం కారులో గాలిలో తేలిపోయిన ఊహలకి... ఇప్పటి పరిస్థితికి ఎక్కడా సంబంధం లేదు. అంతా వింతగా ఉంది. కొత్తకొత్త అనిభవాలు . అనుకోని మలుపులు...

"బాబునిటిచ్చి సీర మార్చుకోండమ్మా!" అంది ఆ ఇల్లాలు.

చంటివాడ్ని ఆమె కందించింది మంజుల. తన హేండ్ బేగ్ తీసి దేనికోసమో వెతికింది. కావల్సింది కనిపించలేదు.

"ఏంటమ్మా! ఏటి ఎత్కుతున్నారు?"

"తాళం చెవులు. ఆయన సాయంత్రం పెట్టెతీసినప్పుడు జేబులో పెట్టుకున్నట్టున్నారు." అంది ఉస్సురుమంటూ.

"పోనీ లెండమ్మా!" అని తన ట్రంకు పెట్టె తీసి అందులోంచి కొన్ని బట్టలు వొత్తిగించి చక్కగా మడత పెట్టిన చీర తీసి "కట్టకోండమ్మా. తడిసీరలో ఉంటే జలుబుసేద్ది. సంటి బిడ్డ తల్లివి కూడాను. పొడిసీర కట్టుకోండి. సుబ్రంగా ఉతికారేసిన సీర. ఎప్పుడో బయటికెల్లినప్పుడు కట్టుకుంటుంటా" అని నిర్మలంగా నవ్వింది ఆమె.

మంజుల సిగ్గుపడింది. "అబ్బే! ఎందుకు? మరి కాసేపటికి అదే ఆరిపోతుంది." అంది కంగారుగా నవ్వి.

తనకున్న మంచి చీరొక్కటీ అతిథికి ఇచ్చేస్తోంది. ఆమె దెంత గొప్ప మనసు! కన్నార్పకుండా చూస్తూండిపోయింది మంజుల.

"ఏంటమ్మా అట్టా సూత్తున్నారు? ఈ పేదింటి మడిసి ఇచ్చిన సీరెలా కట్టుకోనా అని అనుకుంటున్నారా?"


అన్నీ ఉన్న శ్రీమంతురాలు తను. కాని ఏం ప్రయోజనం? పది చీరలున్న సూటుకేసు ఎందుకూ పనికి రాకుండా ఎదురుగా కూర్చుంది. ఆ పల్లెటూరి మనిషి తనకు పొడి బట్ట ఇస్తే గాని గతిలేకపోయింది.

ఆమె మనస్సు నొప్పించానే అని కించపడింది మంజుల. "లేదమ్మా! అదేం లేదు." అని చటుక్కున తీసుకుంది.

ఆమె ఎంతో సంబరపడిపోయింది. "అట్టా వంటింట్లో మరుగుంది"

మంజుల చీర మార్చుకొని బయటకు వచ్చేసరికి నులకమంచం మీద బొంతవేసి పక్కవేసి చంటాడికి ఏవో పాత బట్టలు వెచ్చగా కప్పింది ఆమె.

ఇంతలో తను కూడా తడి పంచె విడిచేసి, పొడి పంచె కట్టుకు వచ్చాడతను. ఎంత దాచుకున్నా రెండు మూడు చిరుగులు కనిపిస్తూనే



ఉన్నాయి. మరో బనీను లేదు కాబోలు తువ్వాలు కప్పుకున్నాడు. అతని దీన పరిస్థితి చూసేసరికి మంజుల మనస్సు బరువెక్కింది.

"ఇందు. ఈ గుడ్డతో తలడుతుసుకో తల్లే!" అని ఆమె తెచ్చిచ్చింది.

మంత్రముగ్ధలా దాన్ని అందుకుంది. ఆమె కుర్చోమంది. మాటలు రాని బొమ్మే అయి కూర్చుంది.

ఇంతలో పిల్లవాడు లేచి రాగం మొదలుపెట్టాడు.

"ఆకలేస్తోంది పసికూనకు. పాలు ఎచ్చపెట్టి తెత్తానమ్మా!" అని నవ్వి "ఏమయ్యోవ్! అట్టాకూకున్నావేటి? రంగమ్మత్తింటి కెళ్లి కొత్త పెరుగు, ఆవకాయ తీస్కురామరి!" అని అర్ధవంతంగా మొగుడ్ని మందలించి వంటింట్లోకి వెళ్లిపోయింది ఆమె.

పాపం. తన కోసం వాళ్లెంత ఇబ్బంది పడుతున్నారో! వద్దు వద్దని ఆపుదామనుకుంది. అంతలోనే గోనెపట్టా గొడుగులా తలకి కప్పుకొని వర్షంలోకి వెళ్లిపోయాడతను. తనకున్న గొడుగు ఎవరికో ఇచ్చేసి తను గోనెగుడ్డ కప్పుకు పోతున్నాడు. దారిద్ర్యం ఉన్న వాళ్లల్లో కూడా ఎంత గొప్ప దాన గుణం!

మంజులకి అంతా వింతగా ఉంది. ఎవరికెవరు? తనెక్కడికి వచ్చింది? తెలియనిచోట కోరని ఆతిథ్యం! దీని విలువ కట్టటం తన తరమా? పిల్ల వాడ్ని ఊరుకోపెట్టాలని కూడా తోచక చిత్తరువులా కూర్చుండిపోయింది!

ఇంతలో ఆమె పాలు వెచ్చబెట్టి తెచ్చింది. తనే బాటిల్లో పోసి చంటాడిని ఒళ్లోకి తీసుకొని పట్టించసాగింది.

"మీ ఆయన పేరేంటమ్మా?"మంజుల అనుకోకుండా అడిగింది.

ఆమె సిగ్గుగా నవ్వింది. "మా వోళ్లలో పెనిమిటి పేరు సెప్పం తల్లే!"

"కావాల్నంటే నా పేరు సెపుతా. నన్నంతా సత్తెమ్మంటరు" అని సత్యకాలపు దాని లాగానే నిర్మలంగా నవ్వింది. అతనేం చేస్తుంటాడని అడుగుదామనుకుంది మంజుల. తానేముందయి రమేష్ ఏంచేస్తుంటాడని అడిగింది సత్తెమ్మ. మంజుల చెప్పింది. మామూలప్పుడయితే మరెవరయినా అడిగితే తన భర్త ఉద్యోగం గురించి ఎంతోగర్వంగా చెప్పుకొని ఉండేది కాని, ఆ పరిస్థితిలో... తన గురించి ఏమీ గొప్పగా చెప్పుకోవటానికి ఆమెకు మనస్కరించలేదు.




వాళ్ల ఆదరణ ముందు మ అంతస్తులన్నీ అర్థహీనాలనిపించాయి.

'అతని సంపాదన ఎంతుంటుంది?' అని సత్తెమ్మ అడిగింది. తనకు తెల్సినా చెప్పాలనిపించలేదు. "ఏమో! నాకుతెలియదు" అని నవ్వేసింది.

"అవున్లెండి. తెలియాలేంటి! అడిగిందల్లా తెచ్చిచ్చే మొగుడుంటేసాన."

స్వచ్ఛమయిన మన సేకాదు. సహజమయిన పరిహాసం.. ఆమె మాటలకు మంజుల మనస్సు పూలవిల్లులా విచ్చుకుంది.

'మీకుపిల్లల్లేరా?' అని అడుగుదామని నోటి చివరదాకా వచ్చింది. నిజంగా పిల్లలులేకపోతే.. ఆ ప్రశ్నకి ఆమె బాధ పడుతుంది. అందుకనే "మీరు కాక ఇంట్లో ఇంకెవరుంటారు?" అని అర్థోక్తిగా అడిగింది.

ఆమె ముఖంలో కళతప్పింది. "ఇద్దరి మేనమ్మా!"

'పిల్లలు లేరు కాబోలు. పాపం.' అని మంజుల జాలి పడింది.

"మాకు ఒక్కడే కొడుకు. పన్నెండేళ్లవాడు. రెండేళ్లప్పుడు ఇదే రోజుల్లో ఇసజ్జొరం వొచ్చి సచ్చిపోయేడు" అంది సత్తెమ్మ గద్గద స్వరంతో.

'అయ్యోపాపం!' ఒక్కకొడుకూ పోవటం. ఎంతబాధ! ఆమె నెలా ఓదార్చాలో మంజులకి తెలియలేదు.

"మామూలు జొరమే అనుకున్నామమ్మా! ఎన్నాళ్లకీ తగ్గకపోతే దరమాసుపత్రి లో సూపిద్దారని పట్నం తీస్కుపోయాడు వాడయ్య. ఇట్టాగే ఆ యేల తెగ వర్షం. బస్సు దిగేతలికి ఆర్ధరేత్రయిపోయిందంట. దరమాసుపత్రికి దారి చెప్పేవోల్లు లేకపోయారు. రేత్రి కేడేనా తలదాసుకుని పొద్దున ఆసుపత్రికి ఎల్దామనుకున్నాడంట. ఆరేత్రి ఆ ఇంటి పంచనుంటే పిల్లాడి పేణాలు పోయేవి కావమ్మా!" అని గ్రుడ్లనీళ్లు కుక్కుకుంది సత్తెమ్మ.

మంజుల మనస్సు వికలమైపోయింది. "ఏమయింది?" అంది ఆత్రుతగా.

"ఆ ఇంటి గలోరు అప్పుడే వచ్చినారంట. ఎవరో దొంగలనుకుని కేకవేశారంట. పిల్లోడికి జొరం బాబూ దొంగలం కాదని కాల్లా వేళ్లాపడ్డాడంట. కాని, ఆ ఇల్లు గలోరు ఈయన మాటలు ఇనిపించుకోలేదు. పోలీసుల్ని పిలిపిత్తామన్నారంట. ఈయన బేజారెత్తి పోయిపిల్లాడ్ని తీస్కొని వొర్సంలో పడిపోయేడు. ఏడనో వంచ దొరికేతలికి తడిసి ముద్దయి పోయేరు. తెల్లారి దరమానుపత్రికెళ్లేసరికి పిల్లాడికి జొరం ముదిరి పోయింది. ఆ సాయంకాలానికి ఆడికి కాలం సెల్లిపోయిందమ్మా!" అని బావురుమంది సత్తెమ్మ.

ఎంతఘోరం జరిగిపోయింది! మంజులకి మతిపోయినట్టయింది. సత్తెమ్మని ఎలా ఓదార్చాలో తెలియలేదామెకు. ప్రాణ్పడిపోయింది.

ఇంతలో అతను తిరిగి వచ్చాడు. "ఇదిగోనే అన్నీతెచ్చా. అమ్మాయిగారికి అన్నం పెట్టు."

అప్పుడు కాని భార్య వంక చూడలేదతను. "ఏందే? ఏమయింది? ఎందుకేడుత్తున్నవ్?" అన్నాడు కంగారు పడుతూ.

"ఏం లేదు? పిల్లోడు గుర్తొచ్చి..."అంది సత్తెమ్మ కల్లొత్తుకుంటూ.

"ఏం సేత్తాం? పేప్తం లేదు. అతని కదెంత హృదయశల్యమో బొంగురు పోయిన అతని గొంతు చెవుతూనే ఉంది. "ఇదొట్టి పిచ్చి దమ్మాయి గోరూ! పట్నం తీస్కుపోకపోతే పిల్లోడు పోయేవాడు కాదంటుంది. వొర్సంలో తడిసిపోయేడు కన్క సచ్చిపోయేడంటుంది. ఆడికాయుస్సు లేదు. అంతే! ఏంసేత్తాం?"

మంజులకి కళ్లు చీకట్లు కమ్మాయి. మరి కాసేపట్లో కూర్చున్నది కూర్చున్నట్టే పడిపోతాననుకుంది. గబుక్కున నులకమంచం మీదకి వాలిపోయి కళ్లు మూసుకుంది.

"ఏంటమ్మా? ఏటయింది?" అన్నాడతను ఆత్రుతగా.

"అయ్యో! అయ్యో! నా సోది సెప్పి బాదిపెట్టినా. తప్పయింది తల్లే!" అంది సత్తెమ్మ ఎంతో నొచ్చుకుంటూ.

మంజులకి గట్టిగా ఏడవాలనివుంది. కానీ, దురదృష్టం. అపరిచితమైన చోటు. ఎలాగో గొంతు పెగల్చుకొని" అందుక్కాదు." అని మాత్రం అనగలిగింది.

"అమ్మాయిగారెప్పుడు తిన్నారో ఏమో.. తొందరగా వొణ్ణం పెట్టవే!"

చంటివాడిని మంజుల పక్కన పడుకోపెట్టి వంటింట్లోకి పరిగెత్తింది సత్తెమ్మ. ఉన్నవన్నీ అమర్చి తెచ్చి "లెండమ్మా! నాల్గు మెతుకులు తింటే కొంచెం సత్తువగా ఉంటది" అంది.

మంజుల కళ్లల్లో నీళ్లు. నోరు తెరిస్తే ఏడుపు ముంచుకు వచ్చేలా ఉంది.

"వద్దమ్మా! నా కాకలిగా లేదు."

"ఆకలి లేపోటం ఏంటమ్మా! ఇంత రేత్రయింది. నాల్గు ముద్దలు తింటే కొంచెం కునుకడుద్ది. తెల్లారేసరికి అయ్యగారొచ్చేత్తారు. తమరింటికి ఎల్లిపోవచ్చు. లేండమ్మా! లేచి తినండి మరి!" అతని ప్రోత్సాహంలో ఎంత అభిమానం!

ఇక కాదనే శక్తిలేక లేచి కూర్చుంది. అన్నం, ఆవకాయ, పెరుగు, ఒబ్బిడిగా సర్దింది సత్తెమ్మ. ఇంట్లో వెండికంచంలో పంచభక్ష పర్వాన్నాలు తినే తనకు ఈ పూట చిత్రమయిన అన్నం కంచం దొరికింది. ఎంత విలువయిన కంచం ఇది! ఆమె వైపు సంచలిత నేత్రాలతో చూసింది మంజుల.

సత్తెమ్మ చిరునవ్వులో చిన్నతనంలేదు. ఒక అతిథికి అన్నం పెట్టగలుగుతున్నాననే ఆనందం ఉంది!

ఏమీ చదువుకోని పల్లెటూరి వాళ్లు. ఎంతో సంస్కారం చూపిస్తున్నారు. ఎన్నోవిధాల మన్నన చేస్తున్నారు. కానీ, ఎంతో చదువుకున్న తను. ఒక్క మాటకూడా రాని దయిపోయింది.

"తినండమ్మా!" అని సత్తెమ్మ ప్రోత్సహించింది.

"ఇంకో కంచం తీసుకురామ్మా!"


"ఎందుకమ్మా! ముందు తమరు తినండి. తర్వాత మేము" అంది ఆమె బిడియంగా.

ఆ ఇంట్లో మరో కంచం లేదని మంజుల కర్థమయింది. ఇంత తినలేనమ్మా!"

"ఎంతుందని!"

లోపల గిన్నెలో అన్నం లేకపోయినా ఇప్పుడు ఆశ్చర్యపోదు మంజుల! ఈ పేదవాళ్లు పేదవాళ్లు కారు! అంతఃకరణలో ఐశ్వర్యవంతులు! ఆ పూట తమ కడుపు మాడ్చుకొని అతిథికి అన్నం పెట్టగల అపూర్వ భాగ్యవంతులు!

"నిజంగా ఇంత తినలేను. కొంచెం తీసెయ్యమ్మా!"




సత్తెమ్మ కంచం పట్టుకు వెళ్లి అన్నం తగ్గించి తెచ్చింది.

మంజులకి నిజంగా ఆకలిగా ఉంది. మామూలప్పుడయితే అలా అందుకున్న వెంటనే తినేసి ఉండేది. కాని, మనస్సులో గూడుకట్టిన గుబులేదో ఆమె గొంతుని నొక్కిపట్టుకుంది. ఎవరికీ చెప్పుకోలేని బాధ!

కాని గత్యంతరం లేదు. భర్త వచ్చేవరకు తనకు తప్పనిసరి! ఎలాగో సగం తిన్నాననిపించుకుంది. ఇక వెళ్లటంలేదు. తిన్నది కడుపులో తిప్పినట్టయింది. గబుక్కున కంచాన్ని క్రింద పెట్టేసి గుమ్మం బయటకు పరిగెత్తి వాంతిచేసేసుకుంది.

ఆ దంపతులు వెలవెలపోయారు.

"ఏంటమ్మా! ఏమయింది?" అంది సత్తెమ్మ కంగారు పడుతూ. గబగబా నీళ్ల చెంబు తెచ్చిచ్చింది.

"ఏంటే? అన్నం బాగో లేదా?" అన్నాడతను భార్య మీద చిరాకు పడుతూ.

"అయ్యో! ఏడన్నమే వండానుకదయ్యా!"

"లేదండీ! అన్నం బాగానే ఉంది. నాకే బాగా లేదు" అంది మంజుల.

"పాపం, ఏమీ ఇనుల్లేదు." అంది సత్తెమ్మ అక్కడ శుభ్రం చేస్తూ.

"నా మూలంగా మీరిన్ని అవస్తలు పడుతున్నారు...." అపైన వల్లమాలిన దుఃఖంతో మంజుల గొంతు పూడిపోయింది.

"లేత్తల్లే! మాకే బాదలేదు. అయ్య మాకప్పగించి ఎల్లేడు. తమరి కెట్టా వుందో అని మా బెంగ. అంతే!"

"ఇప్పుడు నాకే బాధ లేదమ్మా!"

"కాసేపు కళ్లు మూస్కొని నిద్రో తల్లే!" అన్నాడతను.

వాంతి వెళ్లాక ఆమె కాందోళన తగ్గినట్టనిపించింది. నీరసించిన శరీరం మీదికి నిద్రతోసుకు వచ్చింది. మళ్లీ పిల్లవాడి కదలికలకి కాని ఆమెకు మెలకువ రాలేదు. వాళ్లెప్పుడు అన్నం తిన్నారో.. అసలు తిన్నారో లేదో కూడా ఆమెకు తెలియదు.

లేచి చూసుకుంటే తనకు తన పిల్లవాడికి చలిగాలి తగలకూడదని ఏదో దుప్పటి కప్పి ఉంచటం కనిపించింది. అతను ఓ వారగా చాపమీద ముడిచిపెట్టుకొని పడుకున్నాడు. సత్తెమ్మ వంటింట్లో కటిక నేల మీద పడుకున్నట్టుంది.

మినుకు మినుకుమనే ఆ కిరసనాయిలు దీపం వెలుగులో ఆ దంపతుల త్యాగధనం తళుక్కు తళుక్కుమని మెరుస్తోంది!

బయట ఇంకా వర్షం పడుతూనే ఉంది. ఆ వర్షంలో తన భర్త ఏం అవస్థలు పడుతున్నాడో అన్న ఆలోచన రావటం లేదామెకు. అంతకన్నా ఆందోళన పెట్టే బాధ ఏదో ఆమె గుండెల్ని పిండుతోంది.

బయట వర్షంలాగే... నిశ్శబ్దంగా ఆమె కళ్లు వర్షిస్తున్నాయి!

000

తెలతెలవారుతుండగా రమేష్ వచ్చాడు. అప్పటికి వర్షం తగ్గింది.

"అయ్యగారొచ్చేశారమ్మా!" అంటూ సంబరంగా బయటకు వెళ్లాడతను.

పైకి లేచి కూర్చుంది మంజుల. చంటి వాడింకా నిద్రపోతూనే ఉన్నాడు. పాప పుణ్యాలతోటి, మంచి చెడుల తోటి, ఎక్కువ తక్కువల తోటి పని లేదు. అదృష్టవంతుడు... గాఢంగా నిట్టూర్చింది ఆమె.

"వొంట్లో ఎట్టాగుందమ్మా! పాపం రేత్రల్లా కదులుతూనే ఉన్నారు." అంది సత్తెమ్మ సానుభూతిగా.

రాత్రంతా నిద్ర మానుకొని తనని కనిపెట్టి చూ స్తూనే ఉందన్న మాట! అపరాధనిలా తలతిప్పుకొని "లేదు లేదు. బాగానే నిద్రపోయా!" అంది.

ఇంతలో అతనితోపాటు రమేష్ ఇంటిలోపలికి వచ్చాడు. ఇద్దరూ ముఖాముఖాలు చూసుకున్నారు. ఇద్దరి ముఖాలూ వాడిపోయి ఉన్నాయి.

భర్తకి రాత్రల్లా నిద్రలేదు. కారు రిపేరు పనిలో అలసి పోయుంటాడు. అందుకనే అలాగున్నాడని ఆమె అనుకుంది.

భార్యకి ఆదరణ దొరికిన చోట... హాయిగా నిద్ర పట్టి ఉండాలే! ఎందుకిలా ఉంది?

తనగురించి బెంగతో నిద్రపాడుచేసుకుని ఉంటుంది.. అని అతను అనుకున్నాడు.

"పాపం, అమ్మాయిగారి వొంట్లో బావోలేదు బాబూ!" అంది సత్తెమ్మ.

"ఏం, ఏమయింది?" అని దగ్గరగా వచ్చాడతను.

అతని ప్రశ్నలకి జవాబులు చెప్పగలిగే పరిస్థితిలో లేదు మంజుల. చటుక్కున పైకి లేచి "ఏం లేదు నాకేం కాలేదు.... మనం ఇక వెడదామా!" అంది.

మంజుల ముఖం ఎందుకే ఎర్రగా కందిపోయి ఉందో రమేష్‌కి అర్థంకాలేదు. అతనివైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"అలవాటులేని సోటు.. తమరింట్లో ఉన్నట్టుగా ఉంటదా అయ్యా!"

మంజుల చకితురాలైంది. "అలాగెప్పుడూ అనుకోకండయ్యా! ముక్కూ ముఖం తెలియనివాళ్లం. మాకు మీరు చూపించిన ఆదరణ ఈ జన్మలో ఎప్పుడూ మర్చిపోలేను..." ఇంకా ఎన్నో చెప్పాలనుకుంది. మరెన్నో మాటల్లో కృతజ్ఞత వెల్లడించాలనుకుంది. కానీ, భరించలేక పోతున్న ఆవేదనతో ఆమె కంఠం పూడిపోయింది.

"అవునయ్యా! మీరు చేసిన సాయం చాలాగొప్పది." మనస్ఫూర్తిగానే అన్నాడు రమేష్.

"ఎంత మాటబాబూ!" బిడియంగా నవ్వాడతను.

"రాత్రి తొందర్లో వెళ్లిపోయా! మీ పేరు కూడా అడగలేదు."

"నా పేరు కిట్టయ్యండి. అయినా పేర్లో ఏముంది బాబూ! అవొసరంలో మడిసికి మడిసి సాయం కావాల. అంతే!"

మంజుల మనస్సు చివుక్కుమంది. ఆమె కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. వాట్నే ఎవరూ చూడకూడదని పిల్లవాడ్ని లేపనెత్తటానికని మంచం మీదకి వొంగింది మంజుల.

"తమరి సీర..." ఆరిపోయిన చీరని చక్కగా మడతపెట్టి తెచ్చింది సత్తెమ్మ.

అంతవరకు ఆమె చీర కట్టుకున్న స్పృహలోనే లేకపోయింది మంజులకి భర్తవైపు చూసి "సూటుకేసు కీస్ మీ దగ్గరే ఉండిపోయాయి" అంది.

అప్పుడు కాని ఆమె కట్టుకున్న చీరని పరీక్షగా చూడలేదు రమేష్. ఆ దంపతుల త్యాగగుణం అణువణువునా అతనికి కనిపించింది. ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియలేదు.

"కూర్చోండి బాబూ!" అన్నాడు కిష్టయ్య.

"మేమింక వెడతాం. నాకు కొంచెం తొందరపనివుంది."

"తమరు పొద్దుటేల కాపీ తాగుతారు కందా! నానిప్పుడే నర్సయ్య హోటేలు కెల్లి కాపీ తెత్తా! అందాకా అలా కూర్చోండి"

"వద్దు వద్దు. ఇప్పటికే ఎంతో చేశారు. మీరింకేం శ్రమ పడద్దు."

"ఈ మాత్రం దానికి శ్రమేముంది బాబూ! మా కున్నదేదో పెట్టాం. అంతేగా!"

అంతలో చీర మార్చుకొని వచ్చింది మంజుల.

బాటిల్లో పాలు కలిపి తెచ్చింది సత్తెమ్మ. "బాబు లేత్తే ఉంటాయని" అని నవ్వింది.

భర్తవైపు అర్థోక్తిగా చూసింది మంజుల.

జేబులోంచి పర్సుతీసి చేతికొచ్చిన నోట్లు ఇచ్చాడు రమేష్.

"ఇంద. తీస్కోమ్మా!" అంది మంజుల సత్తెమ్మ దగ్గరికి వెళ్లి.

సత్తెమ్మ తెల్లబోయింది. "ఎందుకమ్మా! ఎందుకిది?"

"మీరు చేసిన సాయానికి బదులు తీరుస్తున్నామనుకోకమ్మా! నా తల్లి లాంటి దానివని.." ఇంకెలా చెప్పాలో తెలియలేదు మంజులకి.


"ఏడేనా కూతురి సొమ్ము తల్లి తీసుకుంటాదామ్మా?" అని మృదువుగా ఆమె చేతులు తోసేసింది సత్తెమ్మ.

మంజుల కళ్లు చెమరుస్తున్నాయి. "నా తృప్తికోసం తీసుకోమ్మా!"

"తప్పమ్మా! తమరిలా ఈకూడదు. నాను పుచ్చుకోకూడదు"

"తమరు గొప్పోళ్లు. మా ఇంటికి రమ్మన్నా త్తారా అయ్యా! వొచ్చేరు. అదే మాభాగ్యం!" అన్నాడు కిష్టయ్య నిండుగా నవ్వుతూ.

దేవతలు కోరకుండానే వరమిస్తారుట! ఆ రాత్రి దేవతలా దిగి వచ్చింది ఆమె. ఆ దర్శన




భాగ్యమే చాలు. ఆ సేవకు అనుమతి ఇవ్వటమే మాకు మహద్భాగ్యం అని అతను అనకనేఅన్నాడు.

ఎంత గొప్ప సంస్కారం వాళ్లది! వాళ్ల ఔన్నత్యం ముందు పట్నవాసం దంపతుల తలలు దించుకు పోయాయి.

సూటుకేసుని కారు దాకా తెచ్చి ఇచ్చాడు కిష్టయ్య.

"మీ గొడుగు నా కెంతో ఉపయోగించింది. లేకపోతే. రాత్రి తడిసిపోయి ఉండేవాడ్ని" అంటూ అతని గొడుగు తిరిగి ఇచ్చేశాడు రమేష్.

"సాన సంతోసం బాబూ!"

సత్తెమ్మతో ఇంకా ఏదో చెప్పాలనుకుంది మంజుల. కాని, నోటమాట రాక వెళ్లొస్తానన్నట్టు తలవూపింది.

"బద్రం తల్లే!" తన చేతులెత్తి దీవించింది సత్తెమ్మ.

మారుతి జెన్ బయలుదేరింది.

ఊరుదాటి కొంతదూరం వచ్చాక "అరే! టౌన్‌కి వస్తే వాళ్లని మనింటికి రమ్మనవల్సింది. ఛ! నాకు అక్కడ తట్టలేదు...." అంటూ బ్రేకు వేశాడు రమేష్.

"వద్దు. వాళ్ల నెప్పుడూ మనింటికి రమ్మనవద్దు." అని దాదాపు అరచినంత పనిచేసింది మంజుల.

రమేష్ తెల్లబోయాడు. అప్పటివరకు భార్యముఖాన్ని అతను పరీక్షగా చూడలేదు. మంజుల ముఖం వివర్ణమయి ఉంది. పొంగివస్తున్న దుఃఖాన్ని ఉగ్గపట్టుకుంటున్నట్టు ఆమె కంఠనరాలు ఉబ్బుతున్నాయి.

"ఏంటి మంజూ! ఎందుకిలా ఉన్నావు?"

అంతే! ఆ స్పర్శకోసం.. ఆ ఏకాంతం కోసం.. రాత్రంతా ఎదురు చూసింది. దుఃఖం కట్టలా తెంచుకుంది. వరదలా పొంగిపోయింది.

భార్యని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు రమేష్‌కి. కారు డోర్ తెరిచి ఆమె ఒళ్లోంచి చంటివాడ్ని తీసుకొని వెనక సీట్లో పడుకోబెట్టాడు. తాను ముందుకు వచ్చి ఆమెకు దగ్గరిగా జరిగి పొదివి పట్టుకున్నాడు. "ఏం జరిగింది? ఎందుకింతగా ఏడుస్తున్నావు? నిన్ను వదిలి వెళ్లాననా?"

కాదన్నట్లు తల ఊపింది ఆమె.

"మరి? ఎందుకింతగా బాధపడుతున్నావు? వాళ్లు..."

"....వాళ్ళనెప్పుడూ మనింటికి

పిలవ్వద్దు."

రమేష్‌కి చాలా ఆశ్చర్యంగా ఉంది. వాళ్లెంతో మంచి వాళ్లని... వాళ్ల ఆదరణ ఎప్పటికీ మర్చిపోరాదని అంటూనే.. వాళ్లు తమ ఇంటికి రాకూడదని ఎందుకనుకుంటోంది?

ఎంతఆలోచించినా అతని కర్థం కాలేదు.

"వాళ్లు మనింటికి వస్తే... మన పాపం పండి బద్దలవుతుంది."

అతను చకితుడయ్యాడు. "మనం పాపం చేశామా? ఏమిటి మంజూ? ఏమిటి నువ్వంటున్నది? ఎవరికి?"

"వాళ్ళకేనండీ!" అంది ఆమె ముఖాన్ని చేతులతో కప్పుకుంటూ.

"నువ్వనే దేమి నా కర్థం కావటంలేదు."

"అవునండీ! నాకూ అర్థం కావటంలేదు. అలాంటి పాపం చేసే పాడుబుద్ధి మనకప్పుడు ఎందుకు పుట్టిందో నాకూ అర్థం కావటంలేదు."

"ప్లీజ్ మంజూ! నాక్కొంచెం అర్థమయ్యేలా చెప్పు."

తలఎత్తి భర్తవైపు చూసింది. "మీరు కిష్టయ్యని గుర్తు పట్టలేదా?"

"కిష్టయ్యని గుర్తు పట్టటమేమిటి? ఇది వరకెప్పుడేనాచూశామా?"

"అవును. చూడటమే కాదు. సాయంచేయమని కాళ్లావేళ్లా పడితే కనికరించకుండా వెళ్లగొట్టాం."

అతని ముఖం ఎర్రనయింది. "ఏమిటి నువ్వంటున్నది?"

"గుర్తుకు తెచ్చుకోండి. రెండేళ్ల నాటి మాట..."

అప్పటికి తమకింకా పెళ్లికాలేదు. తామిద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దవాళ్లకా సంగతి తెలియదు. అవకాశం దొరికినప్పుడు తామిద్దరూ ఒంటరిగా కల్సుకుంటూండేవారు. రెస్టారెంట్లు, పార్కులు, సినిమాలు... ఎన్నిచోట్ల తిరిగినా తమకు తృప్తి కలిగేది కాదు. 'ఒక్కసారి' తనివితీరా ఒకరినొకరు కౌగలించుకోవాలన్న తపనతో పిచ్చివాళ్లయిపోయారు.

ఎంతకాలంగానో ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. అతని ఇంట్లో అంతా ఊరికి వెళ్లినరోజు. తన ఫ్రెండింట్లో పుట్టిన రోజు పండగ అని... రాత్రి కక్కడే ఉండిపోతానని తమ ఇంట్లో ఆమె అబద్ధమాడిన రోజు. తామిద్దరూ అతని ఇంట్లో గాఢ పరిష్వంగంలో మధురానుభవాలు చవిచూడాలని ప్లాను వేసుకున్న రోజు!

స్నేహితురాలింట్లో పుట్టినరోజు పండుగ అయిపోయిన తర్వాత ఆమెను తీసుకొని తన కార్లో తన ఇంటికి తీసుకువచ్చా డతను.

విపరీతమయిన వర్షం. అర్ధరాత్రి. అనుకూలమైన వాతావరణం. తమనెవరూ చూడరని నిర్భయంగా ఆత్రంగా ఇంటికి వచ్చారు. కాని, తీరా ఇంటికి వస్తే పోర్టికోలో ముడిచి పెట్టుకొని పడుకున్న రెండు ఆకారాలు కనిపించాయి.

"వాళ్లెవరో మన సుఖాల్ని పాడుచేయటానికి వచ్చిన దుర్మార్గులనుకున్నాం. ప్రేమావేశంలో కల్లు మూసుకుపోయిన మనలో ఆరోజున మంచి తనం, మానవత్వం అన్నీ మంట కలిసిపోయాయి. పిల్లాడికి జ్వరం బాబూ ఒక్క రాత్రికి ఈ పంచక్రింద పడుకోనివ్వండి అని ఆ తండ్రి ఏడుస్తుంటే పోలీసుల్ని పిలుస్తామని భయపెట్టి పొమ్మన్నాము. ఆనాడు వర్షం కురిసిన రాత్రివేళ ఏడ్చిన తండ్రి...ఈ వర్షం కురిసిన రాత్రి మనకు సేవలు చేసిన మంచి మనిషి ఒక్కరేనండీ!" అని బావురుమంది మంజుల.

రమేష్‌కి తలమీద పిడుగులు పడినట్టయింది. "లేదు లేదు. నువ్వెక్కడో పొరపాటుపడ్డావు."

"లేదండీ! అప్పుడు చేసింది మహాపాపం కాని.. ఇప్పుడు పడింది పొరపాటు కాదండీ! పోర్టికోలోని మనుషుల్ని చూసి కంగారు పడి మీరు నన్ను తొందరగా ఇంట్లోకి పొమ్మన్నారు. కాని, కారు లైట్ల వెలుగులో అతన్ని పరీక్షగా చూశాను. మీ రతన్ని తిట్టం విన్నాను. నాకు కామంతో కళ్లు మూసుకుపోయాయి. నా కోరిక తీర్చుకొనే తొందరలో ఉన్నానే కాని.. ఆ తండ్రి మీతో మొరపెట్టుకున్నవేవీ పట్టించుకోలేదు. మిమ్మల్ని వారించలేదు. ఆ వేళ మనం చేసిన ఘోరం ఎటువంటిదో క్రితం రాత్రి సత్తెమ్మ చెపుతూంటే నాకు ఎక్కడేనా తలబద్దలు కొట్టుకుని చచ్చిపోవా లనిపించిందండీ!"

రమేష్ ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. "అంటే! అంటే..."

"...అవునండీ! ఆ రాత్రి వర్షంలో తడిసిపోయారు కిష్టయ్య, అతని కొడుకూ! హాస్పటల్లో చేర్పించినా ప్రయోజనం లేకపోయింది. జ్వరం ముదిరి ఆ పిల్లాడు ఆ మర్నాడు చచ్చిపోయాడు."

తన గుండెల నెవరో బాకుతో పొడిచినంత బాధ కలిగిందతనికి.

"... ఆరాత్రి చీకట్లో మనల్ని చూడలేదు కిష్టయ్య. అతనే మనింటికి వస్తే ఇల్లు గుర్తు పట్టడా? మనల్ని గుర్తు పట్టడా? నా కొడుకు ప్రాణాలు తీసిన పుణ్యాత్ములు మీరేనా అని అతను మన ముఖాల్లోకి చూస్తే? ఆ చూపులకి తట్టుకొనే శక్తి నాకు లేదండీ!"

ఆ తర్వాత మంజుల మాటలు వినలేక తలపట్టుకున్నాడు రమేష్.

రాత్రంతా ఎంతో నరకయాతన అనుభవించింది ఆమె. జరిగింది భర్తతో చెప్పుకున్నాక ఆమెకు మనస్సు తేలికపడింది.

"ఎవరికయితే మనం అపకారం చేశామో వాళ్లచేతే మనకు ఉపకారం జరిగేలా చేశాడు దేవుడు..." అని తనలో తను అనుకున్నట్టుగా అంది ఆమె.

"అవును మంజూ! నువ్వన్నది నిజం... ఉపకారం చేసిన వాళ్లని క్షమించమని అడగడంలో తప్పులేదు..."

అతను ఇప్పుడి కొత్తగా కనిపిస్తున్నాడు. మంజుల కళ్లు చిత్రంగా మెరిశాయి. "అంటే?"

"మతిమతిలో లేక వేళ తప్పుచేశాం. అప్పుడు తప్పుచేశామని మనకి తెలియదుకాని, ఇప్పుడు తెల్సు. తెల్సి క్షమాపణ అడక్కపోవడం పాపం."

భర్త ఎంత మంచివాడు! మంజుల మనస్సు పులకించగా, "పదండి" అంది. కారుని రివర్స్ చేసి ప్రకాశరావు పాలెంవైపు పరిగెత్తించాడు రమేష్. ■

